# త్రిశంకు సంతతి

బొడ్డుకు బంగారాన్ని కట్టుకొని పుట్టిన వాడు కాదు రమణమూర్తి. చిన్నతనం నుంచి బాధ్యతల బరువులు మోస్తూ స్వయంకృషితో ప్రయోజకుడయిన వాడు. ఉద్యోగరీత్యా యల్. ఐ. సి. డెవలప్‌మెంటు ఆఫీసరు. ఇన్‌ష్యూరెన్స్ వ్యాపారాభివృద్ధికి ఎన్ని ప్రణాళికలు వేస్తాడో గృహ సంబంధమైన ఖర్చులలోనూ, ముందుచూపుతో ఖచ్చితంగా వ్యవహరిస్తాడు. హెచ్చులకుపోడు. ఆఫీసులో తోటి వాళ్ళు కొందరు "పిసినారి" అని అన్నా అది బిరుదు అయినట్లే సంతోషిస్తాడు.

లక్ష్మీరాజ్యం అతని భార్య. అతి నిరాడంబరమైన మనిషి. సరి పుచ్చుకొనే తత్వం. అసలామె అవసరాలే స్వల్పం. అలగటాలు, సాధింపులు, పరుషవచనాలాడటం ఆమె నిఘంటువులోనే లేవు. అత్త ఆడ బిడ్డల్తో సహా అంతా ఆమె మంచితనాన్ని మెచ్చుకొనేవారే !

మంచితనంతోపాటు, ఆమె భారీ గుణం కూడా అందుక్కారణమే. లక్ష్మీరాజ్యం ఆలోచనలు భారీ. చెయ్యి అంతకన్నా భారీ. తన స్వంత విషయంలో ఎంత అనాసక్తత ప్రదర్శిస్తుందో యితరులకు పెట్టుబడి విషయం వచ్చేసరికి, మర్యాదల దగ్గరి కొచ్చేసరికి అంతటి శ్రద్ధ, ఆసక్తత కనబరుస్తుంది. యిక వివిధ దేవతలకు దేవుళ్ళకు మొక్కుబడులరూపంలో ఆమె "ప్రామిస్"లకు లెక్కలేదు.

భార్య యొక్క యీ బలహీనతలు గ్రహించిన రమణమూర్తి ఆమె మాట దేన్నీ నోటితో కాదనడు. కార్యరూపంలో చేయడు. యీ విషయంలో మహా మంత్రులకు ఏ మాత్రం తీసిపోడతను !

అలా అతను నానవేసిన విషయాలు సవాలక్ష వున్నా, పతివ్రతా ధర్మంగా భర్తను పన్నెత్తు మాట అనలేదెన్నడూ లక్ష్మీరాజ్యం. అయితే పుష్కరం క్రింద పెద్దకొడుక్కి, తిరుపతి కొచ్చి తలనీలాలిచ్చి నామ కరణోత్సవం చేస్తానన్న మొక్కుబడిని భర్త తీర్చకపోవటం ఆమెకు మనసులో బాధగానే వుంది. ఆ మొక్కుబడి తర్వాత మరో యిద్దరు పిల్లలు పుట్టేరు. మొక్కుబడుల సంఖ్య పెరిగిపోయింది. కానీ పెద్దవాడు పెద్దవాడుగానే వుండిపోయాడు. పేరంటూ లేకుండా !

లక్ష్మీరాజ్యం మనసులో పేరుకొంటున్న యీ అసంతృప్తి, పక్క పోర్షనులో పద్మావతి సంసారాన్ని చూచేక మరింత పెరిగిపోయింది. పద్మావతి భర్త బేంకీ ఆఫీసరు. రమణమూర్తి స్నేహితుడు. పెద్దగా స్థిరాస్తులేం లేకపోయినా, పద్మావతి ప్రదర్శించే దర్జా అంతా యింతా కాదు.

రూపాయి ఖర్చు చేయాల్సినచోట రెండు రూపాయలుగా ఖర్చు చేస్తేనే కాని పద్మావతికి తృప్తి వుండదు. కంటికి యింపు అయిన కొత్త వస్తువు కన్పిస్తేచాలు—మరుక్షణంలో స్వంతం చేసుకోవాల్సిందే. యింట్లో పని వేళల్లో కూడా వంద రూపాయలకు తక్కువ కిమ్మత్తు చేసే చీర కట్ట దంటే ఆమెకు ఎన్ని చీరెలున్నాయో వూహించుకోవచ్చు. యిక ఆమె పిల్లలు జమీందారు ఫాయిలో వుంటారు.

"చచ్చేటప్పుడు కట్టుకుపోముగదమ్మా ! నోరు కట్టుకొని, కోరి కల్ని, సర్దాలని చంపుకొని, కూడబెట్టి ఏం చేయాలిట ? పిల్లలకి ఆస్తులు కూడ బెట్టి యిచ్చే కాలం పోయిందమ్మా ! రేపు ఎలా వుంటుందో ఎవరు చూడొచ్చారు ? బ్యాంకీలే దివాలా తీస్తే కూడబెట్టిందంతా గంగ పాలేగా ?

ఏ క్షణంలో ఏ చట్టం వస్తుందో ? భూములున్న వారి బాధలు చూస్తూనే వున్నాంగా ? " అదీ ఆమె సిద్ధాంతం. ఆ సిద్ధాంతం ఎందుకో లక్ష్మీరాజ్యానికి నచ్చింది. వో రోజు భర్తను కదిలించింది.

"ఏమండీ ! మీకన్నా ఆయనకు ఎంత జీతం ఎక్కువ వస్తుంది? "

"ఎవరికి ? "

"అదే పద్మావతమ్మ భర్తకు ?"

"ఓ విశ్వేశ్వరరావుకా ? ఏం ? దాదాపు మా యిద్దరి జీతం వొకటే. "

"మరి- వాళ్ళంత దర్జాగా హాయిగా ఎలా వుండగలుగుతున్నారు ?"

చెంపమీద కొట్టినట్లు అయింది రమణమూర్తికి. భార్య వైపు చిత్రంగా చూచాడు. ఆమెలో మానసికంగా వస్తున్న మార్పు అతనికి అర్థమయింది.

"మా యిద్దరి ఆదాయమూ వొకటే. కానీ జీవన దృక్పథాలే వేరు. విశ్వేశ్వరరావు జీవన విధానం - అప్పులు చేసైనా సరే నూతన అనుభవాలను జుర్రేయటం. అతను కేవలం జీతంతోనే అంత దర్జాగా బ్రతుకుతున్నాడనుకోకు. అప్పు దొరికే మార్గం వున్నచోటల్లా చేస్తుంటాడతను" అంటూ అప్పులు చేయటంలోగల అనర్థాలను వివరించాడు. లక్ష్మీరాజ్యం భర్త చెప్పిందంతా బొల్లుపోకుండా వింది. చివరికి అంది-

"మీరు మరీనండీ! మనుష్యులమన్నాక అప్పులు చేయకుండా, యిచ్చి పుచ్చుకోటాలు లేకుండా ఎలా కుదుర్తుంది ?- యీనెల అప్పుచేస్తే వచ్చే నెల తీరుస్తాం. జీతంలోనేగా ఏంచేసినా ? అన్నయ్యగారికి మాత్రం వెనుక ఆస్తులేమున్నాయి ? అయినా గౌరవంగా, దర్జాగా బ్రతకటం లేదూ ?"

గౌరవం - దర్జా !

విశ్వేశ్వరరావు దర్జాకు మారుపేరు. అతను అప్పులెంత సులభంగా చేస్తాడో, అంత సులభంగా మరొకరికి అప్పు చేసైనా సరే యిస్తాడు. లేద

నటం తన దర్జాకు భంగమని భావిస్తాడు. పెళ్ళికి శుభలేక వస్తే చాలు ప్రెజెంటేషన్ పట్టుకొని వెళ్తాడు. యిక చందాలు అడగని వాడిది పాపం. చుట్టాలు, స్నేహితులతో అతనియిల్లెప్పుడూ కళకళలాడుతుంటుంది. వెంకటగిరి జరీ చీరెలో, పోలిష్టర్ షర్టులో తప్ప పెట్టుబళ్ళకు కూడా మామూలు బట్టలు కొనే అలవాటు లేదు. అందుకే అతని బేలెన్స్ షీటులో డెబిట్ తప్ప క్రెడిట్ ఎన్నడూ వుండదు.

యివన్నీ భార్యకు విడమర్చి చెప్పి ఏమిటి ప్రయోజనం ?

"రాజ్యం ! నేనొక్కటి అడుగుతాను చెప్పు. బ్రతకటానికి తినాలంటావా ? లేక తినటానికి, భోగభాగ్యాలను అనుభవించడానికి మనం బ్రతకాలంటావా ? "

"బ్రతకటం కోసమే తినాలి. నా కోసం నేనేం కావాలని అడుగుతున్నానుచెప్పండి? కానీ మరీయింత బీదరికంగావుంటే చుట్టుప్రక్కలవాళ్ళు ఏమనుకుంటారో ఆలోచించండి ! పట్టువిడుపు లుండాలిగా ? అయినా అయినవాళ్ళకూడా పెట్టుకోకుండా దానం, ధర్మం, మంచి చెడ్డలు లేకుండా కూడబెట్టిన డబ్బంతా ఏం చేస్తామంటారు ? "

భార్య బుర్రలో యిన్ని ఆలోచనలు వున్నాయని తెల్సుకొని రమణమూర్తి భయపడ్డాడు. భార్య యొక్క యీ ధోరణి ముదిరితే ప్రశాంత గృహజీవనంలో తుఫానులు రావా ?

"చూడు లక్ష్మీ ! కాలాన్ని మూడుభాగాలుగా విభజించవచ్చు. నిన్న-నేడు-రేపు. యీ మూడు కాలాల్లో మనకు ముఖ్యం ఏదంటావ్ ? దేని కోసం బ్రతకాలి ?"

"కాలం మారుతున్నది కదండీ ! రేపు ఎలాగుంటుందో ఎవరు చూడొచ్చారు అయినా రేపు కోసం యివాళ బాధలు పడటం మాత్రం ఏమంత సబబు ? "

"అయితే నేను నిన్నంత బాధలు పెడ్తున్నానంటావా ?"

"నా సంగతి కాదండీ ! కాని కాస్త మన తాహతుకు తగ్గట్లు వుండాలిగా ?"

"తాహతుకు కొలబద్దేమిటి రాజ్యం ? విశ్వేశ్వరరావు తన తాహతుకు మించిన జీవితాన్ని గడుపుతున్నాడని నేనంటే నువ్వు అంగీకరిస్తావా ?"

భర్త మనసు కష్టపడిందని తెల్సుకొని మౌనం వహించింది రాజ్యం.

"మనకన్నా హెచ్చు తరగతి వాళ్ళను అనుసరించాలన్న కోరికే యిలాంటి ఆలోచనలకు మూలం రాజ్యం ! యికనుంచి జీతం తీసుకొచ్చి నీ దోసిట్లో పోస్తా. నువ్వే అన్నీ నడిపించు. సరేనా ?"

భర్తకు కించిత్తు కోపం కూడా వచ్చిందని గ్రహించింది రాజ్యం. తనని తాను తిట్టుకుంది.

"మీ మాట నేనెన్నడు తృణీకరించాను చెప్పండి. మీకు కష్టం కలిగించానివాళ. పాపిష్టిదాన్ని, నన్ను క్షమించండి !"

అప్పటికి భార్య అలా అన్నా రమణమూర్తి సంతృప్తి చెందలేదు. రాబొయ్యే తుఫానులకు అది నాందీ అని అతనికి తెల్సు. అందుకే విశ్వేశ్వరరావుగారి పొరుగునుంచి పారిపోవాలని చూచాడు. అసలు అక్కడి నుంచే యిరువురిలో ఎవరికో వొకరికి బదిలీ అయితే బాగుండునని భగవంతుడిని ప్రార్థించాడు. కానీ ఏ ఒక్కటీ జరుగలేదు. రమణమూర్తిలో ప్రవేశించిన భయమూ పోలేదు.

* * *

ఊళ్లో ఆఫీసర్లు కొందరు కల్సి కుటుంబాలతో సహా యాత్రకు పోయే ప్రణాళిక వొకటి వేసేరు. ఆ వూహ విశ్వేశ్వరరావు బుర్రలో నుంచి వచ్చింది. తగు ఏర్పాట్లు అతను చేయసాగేడు.

ఒక బస్సుకు సరిపడ్డ జనం జమకూరేక కొందరు మిగిలిపోయారు. యింకో బస్సు మాట్లాడుకోవాలంటే జనం సరిపోరు. కొత్త సభ్యులను చేర్చుకొనే కార్యక్రమాన్ని ఇన్‌ష్యూరెన్స్ ఏజెంట్లలా స్వీకరించక తప్ప లేదు. పద్మావతి ఏమి నూరిపోసిందో లక్ష్మీరాజ్యం భర్తను కదిపింది.

"పోనీ — మనంకూడా యాత్రకు పోదామండీ! పది మంది తెల్సినవాళ్ళ తోడు వుంటుంది. పైగా మనకు మొక్కులున్నాయిగా?"

కొన్ని సంవత్సరాలుగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారిదాకా వున్న వివిధ దేముళ్ళకు భార్య మొక్కుకొన్న మొక్కులు వొక్క దెబ్బతో తీరి పోతాయని రమణమూర్తికి తెల్సు. నిజానికి అతను కూడా వొకటి రెండు సంవత్సరాలలో కుటుంబంతో యాత్రలు చేయటానికి తగు ప్రణాళికను వేస్తున్నాడు.

కానీ విశ్వేశ్వరరావు తలపెట్టిన యీ యాత్ర చాలా ఖరీదైనది. అమిత దుర్వ్యయం, ఖర్చు, ఆ ఖరీదులో కల్సి వుంది. వాళ్ళు వసూలుచేసే డబ్బులో సగంతో జాగ్రత్తగా ప్లాన్‌చేస్తే యాత్రలు పూర్తి చేయవచ్చని అతని నమ్మకం.

"డబ్బుకూడా వెతుక్కోనక్కర్లేదటగా? బ్యాంకి వాళ్ళు లాగా మీ ఆఫీసు వాళ్ళు కూడా లోను యిస్తున్నారటగా? ఇంచక్కా నలుగురితో సర్దాగా వెళ్ళొద్దామండీ! మాటిమాటికీ వెళ్తామా? జన్మకొక్కసారేగా?"

యాత్రలకోసం వొక్కొక్కరు ఎంత అప్పుచేసేరో రమణమూర్తికి తెలియనిది కాదు. యాత్రలు అవసరమే. కానీ అప్పుచేసికాదు అని అతని విశ్వాసం. పైగా రెండేళ్ళలో ఎలాగూ తన ప్రణాళిక అమల్లోకి వస్తుం దాయె! యీ లోగా యీ దండగమారి బేర మెందుకు?

"అసలు మిమ్మల్ని అడగటం నాది తప్పు. మా కోరికలు ఏం తీర్చారు కనుక-యింత పెద్ద కోరిక తీరుస్తారని ఆశపడటానికి! పుష్కరం

క్రితం పుట్టిన కొడుక్కి యింత వరకు పేరుకు పొరాగతుల్లేవు. దేనికైనా పెట్టి పుట్టాల్లేండి."

కళ్ళు వత్తుకొంటూ అన్న భార్యను చూచి కరిగిపోలేదు రమణమూర్తి. ఆమెకు నచ్చచెప్పి ఓదార్చే ప్రయత్నమూ చేయలేదు!

*　　　*　　　*

యాత్రనుంచి వస్తూ అక్కడక్కడ పద్మావతి కొని తెచ్చిన సామాను చూచి, లక్ష్మీరాజ్యం కామధేనువు కల్పవృక్షాన్ని చూచినంతగా సంబర పడింది. యిక వస్తువును గురించి, ఆ వస్తువు నాణ్యతను గురించి, దాన్ని ఏ సందర్భంలో ఎలా కొన్నది వర్ణించి పద్మావతి చెపుతుంటే రాజ్యానికి వింటానికి రెండు చెవులూ చాల్లేదు.

"అరసవిల్లిలో కొండ చీపుర్లు ఎంత చవుక అనుకొన్నావ్? అసలు వాటి నాణ్యత మటుకు? చూస్తున్నావుగా- సంవత్సరానికి సరిపడ కొనుక్కొచ్చుకొన్నాను. మా వారు అన్ని వద్దన్నారు కాని, మనమేమన్నామో స్తున్నామా ఏమిటి? బస్సులో వేసేవేగా? పది చీపుర్లకు పది అర్ధలు అయిదు రూపాయలు కల్సి వచ్చినట్లేగా? ఏమిటో యీ మొగాళ్ళకేమీ తెలియవు!

"పూరీ దగ్గర పాలరాతి చపాతీ పీటలు ఎంత బాగా వుంటాయను కొన్నావ్! రైల్లో కూడా అమ్ముతారు. మీకోటి, నాకోటి, పుట్టింటికి అత్తింటికి చెరోటని మొత్తం నాలుగు కొన్నా. వెధవ బస్సులు, వెధవన్నర రోడ్లు. కుదుపులకి ఎప్పుడు ఎలా పగిలేయో ఏమో! సింహాచలం దగ్గరికి వొచ్చి చూచుకుందునుకదా ముక్కలయి వున్నాయి. డబ్బు పోయినందుకు కాదుకానీ, మళ్ళీ అలాంటివి రెండు రూపాయలు ఎక్కువ పెడదామన్నా దొరుకుతాయా?"

పద్మావతి తెచ్చిన వరుకుల్లోకల్లా కలకత్తాలో ఆమె కొనుక్కొచ్చిన బెనారస్ పట్టు చీరెలు రాజ్యానికి బాగా నచ్చేయి. ఒకటి కాదు, రెండుకాదు-

పది పన్నెండు చీరెలదాకా కొనుక్కొచ్చింది. రకరకాల డిజైనులు-రంగులు. అందులో నెమలి కంఠం రంగు మీద ఎర్రటి బార్డరు చీరె మరీ ఆకర్షించింది రాజ్యాన్ని. తనకివ్వమని అడిగితే ? ఆ చీరె కొత్తగా పెళ్ళయిన తన మరదలు కట్టుకొంటే ఎంత బాగుంటుంది ?

"యిలాంటి చీరెలు మన వూర్లో చూద్దామన్నా కన్పించవమ్మా ! ఎంత బాగున్నాయో ! " అంది. పద్మావతి మొహం ఏనుగు చెవి అంత అయింది.

"అందుకేనమ్మా అయిన వాళ్ళందరికీ తలా వొకటి లెక్కవేసి మరీ పట్టుకొచ్చాను. కాస్త ధర ఎక్కువయితేనేం ? పదికాలాల పాటు మన్నేటట్లు వుండాలిగా ?"

ధర సంగతి ఆ క్షణంలో రాజ్యానికి పట్టలేదు. ఆ "అయిన" వాళ్ళలో తను వున్నట్లా - లేనట్లా ?

"అయ్యో. నువ్వు లేకుండానా ? అసలు మా ఆయన సమయానికి డబ్బు పంపకపోతే యిన్ని చీరెలు, వస్తువులు కొనే వీలుండేదా ? యిల్లు కదిల్తే డబ్బనుకో. కానీ ఎప్పుడూ యిల్లు కదుల్తామా ? యీ సర్దాలన్నీ తీర్చుకోగలుగుతామా ?"

రాజ్యానికి అవన్నీ పట్టలేదు. చీరె ఖరీదు తెల్సుకొంది. వొక్క క్షణం ఖరీదు ఎక్కువయినట్లు అన్పించినా, అంతలోనే తనకోసం పద్మావతి కలకత్తా నుంచి చీరెను కొనుక్కొచ్చిందన్న వాస్తవం ఆమెను వుక్కిరిబిక్కిరి చేసింది. పైగా అడగంగానే నెమలి కంఠం రంగు చీరె యివ్వటానికి వొప్పుకొంది కూడా.

"కాని డబ్బు మాత్రం వెంటనే యివ్వాలి. నాకు అవసరం."

డబ్బు మర్నాటి సాయంకాలానికి యిస్తానని చెప్పి చీరె తీసుకొని యింటి కొచ్చింది రాజ్యం. రాత్రి భర్త భోజనం చేసేక చీరె చూపించబోయింది.

"యాత్రకు పోయి పాత్రను తీసుకురమ్మని ఎవరు శాస్త్రం పెట్టేరో కానీ మీ స్నేహితురాలు వో కొట్టుకు సరిపడే సామాను తెచ్చిందని నాకు తెల్సు. కథలు కథలుగా చెప్పుకుంటున్నారు జనం. మన యింటి ముందు దొరికే వస్తువుల్ని కలకత్తా నుంచో, కాశ్మీరు నుంచో తెచ్చినంత మాత్రాన విలువొస్తుందా ? నా కలాంటి పద్ధతులు గిట్టవు."

యిక చీరె కొనివ్వమని భర్త నెలా అడగ్గలదు ? చీరె నెలా వదులుకో గలదు ?

"మీ అన్నయ్యగారి నడిగైనా అప్పు తీసుకొని సాయంకాలానికి నాకు డబ్బివ్వు ! " పద్మావతే డబ్బు పుట్టించే మార్గం చెప్పింది.

రాజ్యం డబ్బు అడగగానే విశ్వేశ్వరరావు ఖంగు తిన్నాడు.

"అవసరం వచ్చింది అన్నయ్యగారూ ! మళ్ళీ వెంటనే సర్దుతాను. వారికి తెలియనియ్యకండి."

"దాందేముందమ్మా! నువ్వేం వేలడిగేవా? లక్షలడిగేవా? వందలేగా? అలాగే యిస్తాను - సాయంకాలానికల్లా."

ఆ సాయంకాలం కోసం రాజ్యం ఎదురు చూస్తుండగా అనుకోకుండా ఓ దృశ్యం ఆమె కంటబడింది.

విశ్వేశ్వరరావుగారింట్లో ఓ నౌకరు వున్నాడు. యింటి పనంతా చేస్తూ నమ్మకంగా వుంటాడు. పెళ్ళాం పిల్లలున్నా వారు అందరూ కల్సేది రాత్రికే. పగలస్తమానం తలా వొక యింట్లో పనిచేసుకొంటుంటారు. ఆ నౌకరు పేరు రంగయ్య.

"ఒరేయ్ రంగయ్యా ! యిలారారా. నీతో కాస్తపనుంది." అంటూ విశ్వేశ్వరరావు రంగయ్యను దొడ్లో ఓ మూలకి తీసుకుపోయాడు. లక్ష్మీ రాజ్యానికి యిది విడ్డూరమనిపించి వారి మాటలు వినసాగింది.

"ఒరేయ్ రంగయ్యా ! నీ దగ్గర డబ్బేమైనా వుందిరా ?"

"నౌకరు ముండాకొడుకును. నా దగ్గర డబ్బేమి ...."

"వేలు కాదురా - వందలే. మళ్ళీ నాలుగు రోజుల్లో సర్దుతా. అర్జంటుగా అవసర మొచ్చింది."

"వుంది కాని....అప్పులివ్వటం - ఆ యిసయాలన్నీ మా యింటిది సూ త్తంటది. ఆ వడ్డీలు అవి ఏంటో నాకు తెల్వదు. దాన్నడిగిసెప్తాను బాబూ !"

"సెప్పటం కాదురా ! వడ్డీ ఎంతయినా ఫర్వాలేదు- డబ్బు పట్టు కురా" అంటూ అంకె చెప్పేడు విశ్వేశ్వరరావు.

తనకు డబ్బు సర్దటం కోసం విశ్వేశ్వరరావు వడ్డీకి అప్పుచేస్తున్నా డన్నమాట ! అంత డబ్బు నౌకరు పనిచేసే రంగడు ఎలా యివ్వగలుగు తున్నాడు ? వాడి మాటల్ని బట్టి వాడి భార్య వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు తేలుతోంది. అంత డబ్బు వాళ్ళకెక్కడిది ?

యీ ఆలోచనల్తో సతమతమవుతుండగా, పక్క పోర్షనులో నుంచి మరో సంభాషణ రాజ్యం చెవిలో దూరింది.

"మీరెలాగైనా ఈ "లోను" రేపు మధ్యాహ్నం లోగా శాంక్షన్ అయ్యేలా చూడాలి విశ్వేశ్వరరావుగారూ ! ఆలస్యమైతే బోలెడంత నష్టం వస్తుంది."

ఆ గొంతు రాజ్యానికి బాగా పరిచయమే. ఆయన పేరు పాలకొండ గంగన్న. ఊళ్ళో పెద్ద వ్యాపారి. చిన్న ఫాన్సీ షాపుతో వ్యాపారం ప్రారంభించి ఇవాళ వ్యాపారాన్ని పలు రంగాల్లోకి విస్తరించాడు. ఇటీవల ఇళ్ళు కట్టి అద్దెలకిచ్చే కొత్త వ్యాపారం చేపట్టేడు. ఇళ్ళు కట్టటానికి అప్పుకు కాబోలు రమణమూర్తిచుట్టూ కూడా చాలాసార్లు తిరిగాడు. రాజ్యాన్ని బుట్టలో వేసుకొని భర్త మీద ఒత్తిడి చేయించే ప్రయత్నం కూడా చేశాడు.

"మీరు శెలవులో వుండటం వల్ల మా పనంతా ఆగిపోయింది. రేపు మీరు ఆఫీసుకు రావాలి. తప్పదు."

తన భర్త అప్పులు చేయొద్దంటాడు ? కాని ఈ పెద్దమనిషికి ఆఫీస్ ద్వారా అప్పులిస్తాడు. పైగా అతనేమిటి ? అంత కలిగివుండి అప్పు కోసం అందర్నీ అంత ప్రాధేయపడతాడు ?

"ఇంతకీ ఈ తడవ ఎంత లోనుకు పెట్టేరు ?"

గంగన్న చెప్పిన అంకె వినగానే రాజ్యం గుండె గుభేలుమంది. అంత డబ్బు అప్పు తీసుకోవటమే ! ఎలా తీరుస్తాడు ? అసలేం చేస్తాడు? అంతంత వడ్డీలు పెట్టి అప్పులు తీసుకుని ఇఖ్ఖకత్తే ఏం లాభం ?

రంగయ్య దగ్గర రహస్యంగా వందలు అప్పుచేసే విశ్వేశ్వరరావు బహిరంగంగా అంతంత డబ్బు అప్పులిస్తాడన్నమాట.

ఇంతకీ తను దొంగతనంగా అప్పుచేసి ఆ చీరకొని మరదలుకు ఇవ్వటమా - మానటమా ?

పెట్టెలో నుంచి చీర తీసి చూచింది. అంత ధర చెయ్యదేమోనని పించింది. అసలీ ఊర్లో ఆ చీర ధర ఎంత అవుతుందో ?

ఆలోచనల్లో వుండగానే సాయంకాలమైంది.

చిత్రం ! రోజుకన్నా ఆ రోజు రమణమూర్తి పెందళాడే ఇంటి కొచ్చేడు. అతని చేతిలో ఓ పేకెట్ వుంది.

"రాజ్యం ! బెనారస్ చీరె మీద మోజు పడ్డావుగా ? కలకత్తాకో కాశీకో పోనక్కర్లేకుండా మన ఊళ్లోనే కొనుక్కొచ్చాను. ఎలాగుందో చెప్పు ?"

చీర చాలా అద్భుతంగా వుంది. కలకత్తా నుంచి తెచ్చిన చీర దాని ముందు వెలావెలా పోతున్నట్లనిపించింది రాజ్యానికి ఆ చీరెను చూస్తే.

"నువ్వు కట్టుకుంటే బాగుంటుందని తీసుకొచ్చాను. నచ్చిందా ?"

"చాలా బాగుందండీ" అంటూంటే ఆమె గొంతులో ఏడుపు జీర అడ్డం పడింది. పొద్దుటనుంచి తనుచేసిన పని, చూచిన దృశ్యాలు, విన్న మాటలు, ఆలోచనలు అన్నీ భర్తకు చెప్పేసి బావురుమంది.

"ఊరుకో రాజ్యం ! నా బంగారు కొండవి కదూ!" అంటూ రమణ మూర్తి భార్యను దగ్గరికి తీసుకొని ఊరడించాడు.

"ఆధునిక ఆర్థిక సూత్రాలు నీ కర్థం కావు రాజ్యం ! ధనవంతులు అప్పు చేయటం బిజినెస్. ఆ అప్పులవల్ల అతనికి లాభాలే కాని నష్టాలు రావు. క్రింది వాళ్ళకు అప్పులు చేసే అవసరం లేదు. కుటుంబ సభ్యు లంతా పనిచేసుకొంటారు. రంగన్నలాంటి వాళ్ళు అప్పులిచ్చే చిన్న వ్యాపా రాలు చేసుకుంటారు కూడా. ఒకవేళ ఎవరైనా వ్యసనాలకు లోనయి అప్పు చేద్దామన్నా వారికి అప్పు పుట్టదు కనుక బాధ లేదు. ఇక ఎటొచ్చీ మనం వున్నామే-మధ్య తరగతి వాళ్ళం-త్రిశంకు సంతతి వాళ్ళం అటూ ఇటూ ఆధారంలేని ఊహాస్వర్గంలో జీవిస్తుంటాం. మిధ్యా గౌరవాలు, అలవాట్లు, ఆచారాలు ! ఆవకాయ పెట్టుకోటం కోసం, యాత్రలు చేయటం కోసం, పెళ్ళిళ్ళకు కట్నాలు చదివించటం కోసం, సమర్తబంతులు పెట్టటం కోసం, ఇలాంటి సవాలక్ష కోసం, మనం అప్పులు చేస్తాం. చింతకాయ పచ్చడిలో ఇంగువ లాగా ఆడబ్బు కరిగిపోతుందేకాని మనకి ఆర్థిక లాభాలు తెచ్చిపెట్టదు. అందుకే యిన్నేళ్ళు యింత పెద్ద ఉద్యోగాలూ చేసి రిటై రయ్యాక చివరికి చాలామంది చెట్టుకిందికి చేరాల్సివస్తుంది. దేశానికే కాదు, కుటుంబానికీ ఆర్థిక ప్రణాళిక అవసరమే రాజ్యం ! సుఖంగా బ్రతకటం వేరు, డాబు దర్జాలతో బ్రతకటంవేరు. డాబు దర్జాలకుపోతే రంగన్నలాంటి వాళ్ళను కూడా యాచించాల్సివస్తుంది ఎప్పుడో ఒకప్పుడు. ఏమంటావ్ ?"

"అవునండీ!" ఆమె భర్త హృదయంలో తలదాచుకొంది.

"డాబుకు పోతే పుబ్బకొట్టి అందరూ మోసం చేస్తారు. యీ చీరె

వెల ఎంతో తెల్సా ? మీ స్నేహితురాలు కలకత్తా ? నుంచి తెచ్చిన దాని కన్నా వంద రూపాయలు తక్కువ."

"నిజమా !" అన్నట్లు తలఎత్తి భర్త కళ్ళల్లోకి చూచింది.

"యిదోరకం దోపిడీ అంటాను. యాత్రాస్థలాల్లో యిదిజాస్తి. డాబు దర్జాలకు బట్టలు కట్టి మానభంగం చేయట మంటే యిదేకదూ ? నా మీద నీకు నమ్మకం లేకపోతే యిదిగో రసీదు."

"క్షమించండి ! తెలివి తక్కువగా ప్రవర్తించాను. నేనా చీరె తీసు కోనని యిప్పుడే చెప్పొస్తాను పద్మావతికి."

రమణమూర్తి భార్య రెక్క పట్టుకొని ఆపేడు. కళ్ళతోనే వారించాడు.

"తోటివాళ్ళను కించపర్చడం భావ్యంకాదుగా ? పైగా యీ చీరె నువ్వుకట్టుకోవాలని నేను మోజు పడ్డాను. ఆ చీరె నా చెల్లెలికివ్వాలని నువ్వు మోజు పడ్డావు. వందరూపాయల్లో పోయేదేంలేదు. వేల ఖరీదు చేసే అనుభవం వచ్చిందిగా నీకు ? ఆ చీరె ఆమె దగ్గర కొనుక్కో. కానీ అప్పు చేసి కాదు. యిదిగోడబ్బు, యిచ్చేసిరా."

లక్ష్మీరాజ్యానికి ఆ క్షణంలో భర్త సాక్షాత్తూ ఆ వెంకటరమణ మూర్తి లాగే కన్పించాడు. తిరుపతి వెళ్ళి మొక్కు తీర్చుకొంటున్న అనుభూతి కల్గింది. చేతులు జోడించింది కనులు మూసింది.

"భగవంతుడిని ఏం వరమడుగుతున్నావ్ ? మన త్రిశంకు సంతతికి మోక్షం ప్రసాదించమనేనా ?" అంటూ దగ్గరికి తీసుకున్నాడు.

భర్త కౌగిట్లో కన్పించిన భద్రత ఆమెకు నూతన శక్తిని, అనురాగాన్ని ప్రసాదించింది.

(విజయ - జూన్ 1979)